కథాకేళి



# కొన్ని కన్నీళ్ళు కొందరికే

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

రిక్షా కిష్టయ్యకి చాలా కోరిక లున్నాయి. రిక్షా అతని ఇంటి పేరు కాదు. వృత్తి రీత్యా. అతను విజయవాడలో రిక్షా లాగుతుంటాడు కాబట్టి అంతా రిక్షా కిష్టయ్య అంటుంటారు.

అతని కున్న చాలా కోరికల్లో ఒకటి కొండకి వెళ్ళి రావడం. కొండ కంటే కనకదుర్గ కొండకో, తిరుపతి కొండకో కాదు. శబరిమలై కొండకి. అనేక మంది మాల వేసుకుని, నల్లటి బట్టలు కట్టుకొని, నిష్ఠగా వుండి శబరి మలైకి వెళ్ళి రావడం అతనికి తెలుసు. మాల వేసుకున్న వారెవరైనా తన రిక్షా ఎక్కితే చాలు వాళ్ళని అడిగేవాడు శబరిమలై గురించి. ఓ వ్యక్తి సాయంత్రం జరిగే అయ్యప్ప పూజకి పిలిచాడు. కిష్టయ్య పూజకి వెళ్లాడు. అందరూ భక్తిపార వశ్యంగా 'స్వామియే శరణం, శరణం అయ్యప్ప' అంటూ భజన చేయడం చూశాక అనిపించింది, తనూ మాల వేసుకుని కొండకి వెళ్ళి రావాలని.

ఓ పెద్ద మనిషి దగ్గర దీక్ష తీసుకుని మాల వేసుకున్నాడు. నల్లచొక్కా, నల్లలుంగీ ధరించ సాగాడు. నుదుట ఎర్రటి కుంకం బొట్టుతో నల్లబట్టల్లోని కిష్టయ్యని చూసి చెప్పింది అతని భార్య:

"అచ్చం స్వర్గలోకం బయట గేటు తెరవబోయే ముందు క్యూలోవున్న పుణ్యాత్ముడిలా వున్నావ్."

చిన్నగా నవ్వాడు కిష్టయ్య. రిక్షా తీసుకుని బయటకి వచ్చాడు. రిక్షావాడు అయ్యప్ప బట్టల్లో వుండడంతో చాలా మంది ఆశ్చర్యంగా చూడడం గమనించాడు కిష్టయ్య. మనసులో నవ్వుకున్నాడు. 'రిక్షా లాగే వాడికి మాత్రం భక్తి వుండదా? వీళ్ళ కెందుకింత ఆశ్చర్యం?' అనుకున్నాడు.

ఒకరిద్దరు పేసెంజర్లు అడిగారు అనుమానంగా:

"అయ్యప్పమాల వేసుకున్నావా?"

"అవును దొరా" చెప్పాడు కిష్టయ్య.

"కొండకి వెళ్ళి రావాలంటే చాలా ఖర్చవుతుందిగా. మన రాష్ట్రం కూడా కాదాయే."

"ఆ వివరాలన్ని తెలుసుకున్నాను దొర. చిట్టి కడుతున్నాను. ఆ డబ్బుతో వెళ్ళివస్తాను."

మొదటి రోజు సరిగ్గా బేరాలు తగల్లేదు కిష్టయ్యకి.

రిక్షా కిరాయి పోను నాలుగు రూపాయిలు మాత్రమే మిగిలాయి.

"ఇదేందిరా? మాలేసుకున్నాక కిరాయి తగ్గింది?" అడిగింది అతని భార్య.

"ఏమోనే. స్టేషన్‌లో గంట పైనే నిలబడ్డాను. ఎవరూ రాలేదు" చెప్పాడు బాధగా.

మర్నాడు రిక్షా కిష్టయ్య బస్‌స్టేండ్ బయట నిలబడ్డాడు. మిగతా రిక్షావాళ్ళకి బేరాలు తగలసాగాయి కాని అతనికి బేరాల్లేవు.

చివరికి అతని ఒక్క రిక్షానే మిగిలింది. రిక్షా కోసం సామానుతో నిలబడ్డ అతని దగ్గరకి వెళ్ళి అడిగాడు కిష్టయ్య.

"రిక్షా కావాలా బాబు?"

"వద్దు."

"ఎక్కడికి వెళ్ళాలండి?" అడిగాడు మళ్ళీ.

"ఎక్కడికీ లేదు."

ఇంకో రిక్షా వచ్చాక దాన్లో ఎక్కుతున్న అతన్ని చూసి అడిగాడు కిష్టయ్య బాధగా.

"ఏం దొరా? నా రిక్షా ఎందుకు అక్కర్లేక పోయిందో కూసింత చెప్తారా?"

"నువు మాల వేసుకున్నావు కదరా. అయ్యప్ప దీక్షలో వున్నవాడు తొక్కుతుంటే నేనెలా కూర్చోగలను? కళ్ళు పోవూ."

బేరాలు తగలక పోవడానికి కారణం అర్థం అయింది.

మర్నాడు వుదయం కిష్టయ్య అయ్యప్ప స్వామి ఫోటోకి భక్తిగా దణ్ణం పెట్టి చెప్పాడు కళ్ళ నీళ్ళతో:

"స్వామీ, నీ మీద భక్తి లేక కాదు. భుక్తి గడవాలని దీక్ష విరమించాను. చచ్చేలోగా ఏదో రోజు నీ కొండకి వచ్చి నిన్ను చూసే వరం ఇవ్వు స్వామీ."

ఖాకీ రంగు నిక్కరు, తెల్ల చొక్కాతో రిక్షా తొక్కుకెళ్తున్న తన భర్తని చూసి ఆ మాటలతో కిష్టయ్య కళ్ళు తెరచుకున్నాయి. తనకి క్రితం రోజు, ఆ రోజు చిన్నగా నిట్టూర్చింది రిక్షా కిష్టయ్య భార్య. ●

